ప్రజాశక్తి
మంగళవారం 12 మార్చి, 2024
శ్రీకాకుళం



నేడు వైసిపి ఆవిర్భావ దినోత్సవం

జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

శ్రీకాకుళం అర్బన్ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 12న శ్రీకాకుళంలో ఘనంగా నిర్వహించనున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని చంద్రమహల్ ఎదురుగా ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు అల్పాహారంతో మొదలవుతుందన్నారు. ఈ ఆవిర్భావ వేడుకల్లో పార్టీ పతాకావిష్కరణ, కేక్ కటింగ్, భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్‌పి చైర్‌పర్సన్, మున్సిపల్ చైర్మన్లు, బిసి కార్పొరేషన్ చైర్మన్లు, కార్యకర్తలు పాల్గొవాలని కోరారు.

టిడిపిలో టిక్కెట్ల టెన్షన్

- సీట్ల సర్దుబాటుపై చంద్రబాబు చర్చలు
- రెండో జాబితాపై ఇన్‌ఛార్జీల ఉత్కంఠ
- పార్టీకి అచ్చెన్నాయుడు ఏం ఫీడ్‌బ్యాక్ ఇస్తారోనని ఆందోళన

టిడిపిలో టిక్కెట్ల టెన్షన్ కొనసాగుతోంది. టిడిపి, జనసేన పొత్తులో భాగంగా జిల్లాకు సంబంధించి ఇటీవల వెలువరించిన జాబితాలో టెక్కలి, ఇచ్ఛాపురం, ఆమదాలవలస నియోజకవర్గాలకు పార్టీ అధినేత చంద్రబాబు పేర్లను ప్రకటించారు. బిజెపితో పొత్తు అంశం తేలాక తర్వాత జాబితా వెలువరిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. బిజెపితో పొత్తు కుదరడం, మరోవైపు అమరావతిలో సోమవారం మూడు పార్టీల నేతల మధ్య సీట్ల సర్దుబాటు వార్తలతో నియోజకవర్గ ఇన్‌ఛార్జిల్లో మరింత ఉత్కంఠ పెరిగిపోయింది. మరోవైపు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అధినేత చంద్రబాబుకు ఏం ఫీడ్ బ్యాక్ ఇస్తారోనని అందరిలోనూ ఆందోళన నెలకొంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలోనే నంబర్ వన్ ఎమ్మెల్యేగా గుర్తింపు తెచ్చుకున్న గుండ లక్ష్మీదేవి సైతం టిక్కెట్ కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు తలెత్తాయి. పార్టీలో నెలకొన్న పరిస్థితులే ఇందుకు కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి 2019లో ఓడినా నాటి నుంచి పార్టీ పిలుపుల్లో భాగంగా ఆందోళనలు నిర్వహించడం, ప్రజల్లో సన్నిహిత సంబంధాలు కొనసాగించడం చేస్తూనే ఉన్నారు. అసంతృప్తి, అసమ్మతి మాటలకు తావులేని శ్రీకాకుళం నియోజకవర్గంలో ఎన్నికలకు రెండేళ్ల ముందు అంటే 2022లో పార్టీ పెద్దలు అసమ్మతి ఆజ్యం పోశారు. అందులో మాజీ ఎంపిపి తనయుడు గొండు శంకర్‌ను తెరపైకి తీసుకొచ్చి గ్రూపుల పోరుకు తెరతీశారు. గొండు శంకర్‌తో మరికొందరిని ఒకేతాటిపైకి తెచ్చి పోటాపోటీ కార్యక్రమాలు చేయిస్తూ వచ్చారు. ఇంతింతై వటుడింతై అన్నట్లు అసమ్మతి ముదిరిపాకాన పడింది. ఇరువురిలో ఎవరికి టిక్కెట్ ఇచ్చినా రెండో వ్యక్తి సహకరించని పరిస్థితి తీసుకొచ్చారు. గెలుపు అవకాశాలు ఉన్న నియోజకవర్గంలో టిడిపికి గడ్డు పరిస్థితిని తీసుకొచ్చారు. ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని తప్పించడమో లేక ఓడించడమో లక్ష్యంగా పార్టీ పెద్దలు కుట్రలు పన్నుతున్నారని గుండ వర్గీయులు మండిపడుతున్నారు. 2014 ఎన్నికల సందర్భంలో మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణను తప్పించేందుకు ఇదే రకమైన వ్యూహం పన్నారని వారు గుర్తు చేస్తున్నారు. గుండ అప్పల సూర్యనారాయణ గెలిస్తే సీనియర్ ఎమ్మెల్యేగా ఆయనకు మంత్రి పదవి దక్కొచ్చనే ఉద్దేశంతో ఆయనపై లేని వ్యతిరేకతను సృష్టించి, టిక్కెట్ ఇవ్వకుండా చేయడంతో పార్టీ పెద్దలు వెనుకుండి కథ నడిపారని వారు చెప్తున్నారు. రెండు సార్లు గెలిచిన ఎమ్మెల్యేగా, బిసి మహిళగా ఉన్న గుండ లక్ష్మీదేవి గెలిస్తే తమకు మంత్రి పదవి దక్కకపోవచ్చనే ఉద్దేశంతో అసమ్మతి, వ్యతిరేకత ఉందంటూ అధిష్టానం దృష్టికి వెళ్లేందుకు మరోసారి యత్నిస్తున్నారని వారు లోలోన రగిలిపోతున్నారు.

'ధర్మాన'ను గెలిపించేందుకేనా?

టిడిపిలో పరిణామాలను పరిశీలిస్తున్న నియోజకవర్గ వైసిపి నేతలు లోలోన సంతోషపడుతున్నారు. టిడిపిలో గ్రూపుల పోరుకు తమకు లాభిస్తుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ధర్మానను గెలిపించడానికే టిడిపి పెద్దలు గొండు శంకర్‌ను దించారన్న చర్చ నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న సూత్రాన్ని టిడిపి పెద్దలు అమలు చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. బిసి మహిళ, రెండు సార్లు గెలిచిన ఎమ్మెల్యేగా గుండ లక్ష్మీదేవి ఉండకూడదనేది మొదటిది కాగా, చాలా కాలం నుంచి తమ మధ్య పెనవేసుకున్న బంధంలో భాగంగా రెవెన్యూ మంత్రి ధర్మానను గట్టెక్కించడం ఇందులో మరో వ్యూహంగా కనపడుతోందని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఆ నియోజకవర్గాల్లోనూ గ్రూపుల పోరే

పాతపట్నం, నరసన్నపేట, ఎచ్చెర్ల నియోజక వర్గాల్లో గ్రూపుల పోరు నెలకొంది. తగవులు తీర్చాల్సిన పార్టీ పెద్దలే పొగపెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాతపట్నంలో టిడిపి ఓటమి తర్వాత నియోజకవర్గ బాధ్యతలను పార్టీ అధిష్టానం కలమటకు అప్పగించింది. అక్కడ ఇన్‌ఛార్జికి ఇబ్బంది పెట్టేలా టిడిపి నాయకుడు మామిడి గోవిందరావు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కలమటను వ్యతిరేకించే కొంతమంది నాయకులు గోవిందరావు పక్షాన చేరారు. నరసన్నపేటలో ఇప్పటివరకు మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావుకే టిక్కెట్ వస్తుందని అంతా అనుకుంటున్న తరుణంలో పార్టీ పెద్దలు అక్కడ కొత్తగా మారో పేరును తెరపైకి తీసుకొచ్చారన్న చర్చ నడుస్తోంది. మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు తనయుడు, వైద్యులు బగ్గు శ్రీనివాసరావు టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నారన్న వార్తలతో అక్కడి టిడిపిలో ఇబ్బంది మొదలైంది. ఎచ్చెర్లలో పార్టీ సీనియర్ నేత కళా వెంకటరావు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చూస్తున్నా... పార్టీ నాయకుడు కలిశెట్టి అప్పలనాయుడు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వల్పంగానైనా పార్టీ కేడర్ కొంత అటు వెళ్లింది. పలాస నియోజకవర్గంలో ఎలాంటి గ్రూపుల పోరు లేకపోయినా సర్వేల ద్వారా అభ్యర్థిని నిర్ణయించాలనే ఉద్దేశంతో మొదటి జాబితాలో అధిష్టానం ప్రకటించలేదు. నియోజకవర్గంలో నెలకొన్న పార్టీ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాలను అధిష్టానం వెయిటింగ్ లిస్టులో ఉంచినట్లు తెలుస్తోంది.

ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల బాండ్లు వివరాలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను వెల్లడించకుండా కుట్ర చేస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఎస్‌బిఐ వైఖరిని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన బ్యాంచ్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, గత నాలుగేళ్లలో అమ్మిన బాండ్లు, వాటిని కొన్న వారి సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి ఈ నెల 6న బ్యాంకు అందించాలని, ఇసి ఆ వివరాలను ఈ నెల 13లోగా బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు తీర్పులో ఆదేశించిందని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బిఐ విఫలమైందన్నారు. ఈ సమాచారాన్ని ఇవ్వడానికి ఎస్‌బిఐకి ఇచ్చిన మూడు వారాల గడువు ముగిసిందన్నారు. ఆ వివరాలను వెల్లడించడానికి బదులు ఎస్‌బిఐ గడువు ముగుస్తున్న సమయంలో మరో 116 రోజులు అదనపు గడువు కావాలని కోర్టును ఆశ్రయించడం సరికాదన్నారు. అంటే ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించకుండా ఉండేందుకు పన్నాగం పన్నినట్టు స్పష్టమవుతోందని విమర్శించారు. తన కార్యకలాపాలన్నింటినీ డిజిటలైజ్ చేసిన ఎస్‌బిఐ ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను కొద్దిరోజుల్లో పొందుపరిచి ఇవ్వలేకపోవడం నమ్మశక్యం కాదన్నారు. మోడీ ప్రభుత్వం ఒత్తిళ్ల కారణంగానే ఎస్‌బిఐ ఈ వైఖరి తీసుకుందన్నారు. ఇప్పటికైనా ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలన్నీ ఎస్‌బిఐ అందచేసేలా సుప్రీం కోర్టు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శివర్గ సభ్యులు జి.సింహాచలం, సిహెచ్.అమ్మన్నాయుడు, జి.ఈశ్వరమ్మ, గోవర్ధనరావు, సుధాకర్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ఎన్నికల బాండ్లు వివరాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేయాలని సిపిఎం నాయకులు నంభూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. టెక్కలిలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న స్టేట్ బ్యాంకు వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి ఎల్లయ్య, హెచ్.ఈశ్వరరావు, వాకాడ ధనుంజయరావు, యర్ర ఉదయ్, పాలిన సాంబయ్య, పోలయ్య, గౌరమ్మ పాల్గొన్నారు.

ఆమదాలవలస : ఎన్నికల బాండ్ల వివరాలను బయటపెట్టాల్సిందేనని సిపిఎం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశాయి. పట్టణం లోని ఎస్‌బిఐ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి మోహనరావు, బొడ్డేపల్లి జనార్థర రావు, జి.ధనుంజయరావు, బుడుమూరు మోహన రావు, పి.రామారావు, కె.సంతోష్‌కుమార్, సిహెచ్. రమణ, మురళీధర్, ఎ.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

మందస : మందస స్టేట్ బ్యాంకు వద్ద చేపట్టిన ధర్నాలో సిఐటియు నాయకులు పి.దేవేంద్ర, చిరంజీవి, వెంకటేష్, జయరాం పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు



ఆమదాలవలస : ధర్నా చేస్తున్న నాయకులు



మందస : ధర్నా చేస్తున్న నాయకులు



టెక్కలి : ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

వంశధారలో జనసందోహం

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థం

శ్రీకాకుళం అర్బన్, జలుమూరు : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానాలకు యాత్రికులు పోటెత్తారు. జిల్లా నుంచే కాక విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా రాష్ట్రం నుంచీ యాత్రికులు వేలాదిగా చక్రతీర్థ స్నానాలకు తరలివచ్చారు. స్వామివారి ఆలయాన్ని సందర్శనానికి ఆదివారం అర్ధరాత్రి నుంచే బారులు తీరారు. సోమవారం మధ్యాహ్నం 12.10 నిమిషాలకు ఆలయ ప్రవేశాన్ని నిలుపుదల చేసి అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం పార్వతీ సమేతుడైన శ్రీముఖలింగేశ్వరుని ఉత్సవమూర్తులను పుష్పాలతో అలంకరించి శాస్త్రోక్తంగా బయటకు తీసుకొచ్చారు. ఆలయ ప్రాంగణం నుంచి నంది వాహనంపై ఉత్సవ మూర్తులను తీసుకెళ్లి అనంతరం తిరువీధి ప్రారంభమైంది. నంది వాహనంపై ఉత్సవమూర్తులను ఆలయానికి ఉత్తర దిశగా ఉన్న మిరియాపల్లి వంశధార రేవు వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ స్వామివారికి స్నానాలు ఆచరించిన అనంతరం లక్షలాది మంది యాత్రికులు చక్రతీర్థ స్నానాలు ఆచరించారు. వంశధార నదికి ఇరువైపులా కట్టుదిట్టంగా భద్రతను ఏర్పాటు చేశారు. చక్రతీర్థ స్నానాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయం నుంచి మిరియాపల్లి రేవు వరకు భద్రతను ఎస్‌పి జి.ఆర్.రాధిక స్వీయ పర్యవేక్షణలో కొనసాగింది. ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన యాత్రికులకు పలు గ్రామాల వద్ద అన్న సంతర్పణ చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లను అందజేశాయి. వేడుకగా సాగిన ఈ యాత్రలో గతేడాది కంటే ఈసారి రెట్టింపు యాత్రికులు రావడంతో వంశధార నదిలో ఎక్కడ చూసిన జనమే కనిపించారు.



చక్రతీర్థ స్నానాలకు బారులు తీరిన యాత్రికులు (ఇన్‌సెల్‌లో ఉత్సవమూర్తులు)



పర్యవేక్షిస్తున్న ఎస్‌పి రాధిక

ఎన్నికల విధులపై సంపూర్ణ అవగాహన

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల విధులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులకు సూచించారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో సోమవారం ఆర్వో, ఈఆర్వోలు, నోడల్ అధికారులు, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, ఎంసిసి, వివిఎస్టి, కలెక్టరేట్ సెక్షన్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై జెసి ఎం.నవీన్‌తో కలిసి సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగడానికి జిల్లా యంత్రాంగం కీలకమన్నారు. ఎన్నికల బాధ్యతల్లో ఉన్న వారంతా నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో వినియోగించే మానవశక్తి ప్రణాళిక, వారికి తగిన శిక్షణ, ఎన్నికలకు వినియోగించే యంత్ర పరికరాల నిర్వహణ, అలాగే రవాణా వ్యవస్థల పర్యవేక్షణ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)కి సంబంధించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. నోటిఫికేషన్ విడుదల నాటి నుంచి ఎలక్షన్ కోడ్ అమలు లోకి వస్తుందని, అప్పటి నుంచి పోటీలో ఉండే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఎన్నికల వ్యయాన్ని పర్యవేక్షించాలని అన్నారు. ఎన్నికల వ్యయాన్ని గుర్తించడంలో సంబంధిత శాఖల పర్యవేక్షణ, సమన్వయం అవసరమన్నారు. పార్లమెంట్ అభ్యర్థులు రూ.95 లక్షలు, అసెంబ్లీ అభ్యర్థులు రూ.40 లక్షల వరకు మాత్రమే ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు ఎన్నికల కమిషన్ పరిమితిని విధించిందని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న వారంతా పోస్టల్ బ్యాలట్ కచ్చితంగా, సులభంగా, సౌకర్యవంతంగా ఓటు వేసేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ సారి పోస్టల్ బ్యాలెట్‌ను ఎన్నికల విధుల్లో పాల్గొనే డ్రైవర్లకు సైతం అందుబాటులో ఉంచుతామన్నారు. బుధవారం నాటికి ఎన్నికల విధులకు గుర్తించిన వారంతా తమ ఓటు గుర్తింపు కార్డు ప్రతిని సంబంధిత నోడల్ అధికారికి అందజేయాల్సి ఉంటుందని వివరించారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమల్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

డోలోత్సవానికి మంత్రికి ఆహ్వానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

జిల్లాలోని గార మండలం శ్రీకూర్మంలో ఈ నెల 22 నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న డోల్సోవానికి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆలయ కార్యనిర్వహణాధికారి జి.గురునాథరావు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం పాలక మండలి సభ్యులతో కలిసి మంత్రికి ఇంటికి వెళ్లి డోలోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలు 22న ప్రారంభమై 25న ముగుస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాచార్యులు, అర్చకులు కిషోర్‌బాబు, గార ఎంపిపి గొండు రఘురాం, శ్రీకూర్మనాథ ఆలయ పాలక మండలి సభ్యులు డబ్బీరు శ్రీనివాసరావు, బరాటం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డిఆర్‌డిఎ పీడీగా కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారిగా పి.కిరణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పార్వతీపురం మన్యం జిల్లా ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై శ్రీకాకుళం వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ డి.వి.విద్యాసాగర్‌ను పేరెంట్ డిపార్టుమెంట్‌కు బదిలీ అయ్యారు. విద్యాసాగర్ పంచాయతీరాజ్‌శాఖ నుంచి పూర్తి అదనపు బాధ్యతల్లో డిఆర్‌డిఎ పీడీగా వచ్చారు. ఆయనను ఓటర్ల ప్రక్రియలో కీలక బాధ్యతలను అప్పగించారు. నోడల్ అధికారిగా వ్యవహరించిన ఆయనును తక్షణమే విధుల నుంచి తప్పించాలని ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు వచ్చాయి. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయనను ఎన్నికల బాధ్యతల నుంచి తప్పించారు. ఎట్టకేలకు ఆయనను రిలీవ్ చేస్తూ పి.కిరణ్‌కుమార్‌కు కొత్త పీడీగా నియమిస్తూ సెర్ప్ సిఇఒ మురళీధరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా నియమితులైన పీడీ కలెక్టరేట్‌లోని కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలో బ్రహ్మణతర్లా, బంటుకొత్తూరు, తర్లాకోట పంచాయతీల పరిధిలో సచివాలయం, రైతు భరోసా, గ్రామీణ వైద్యశాల వివిధ భవనాలను సోమవారం ప్రారంభించారు. పొందరవీధిలో రోడ్డు నిర్మాణానికి, బోరు వేయడానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పలాస ఎంపిపి ఉంగ ప్రవీణ, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావుచిట్టి, సర్పంచ్‌లు బాడాన పుష్పవతి, పిట్ట షణ్ముఖరావు, కొర్ల సంతోష్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని అక్కుపల్లిలో నాడు-నేడులో భాగంగా రూ.1.85 కోట్లతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపెల్లి ఉదయ్ కుమార్, సర్పంచ్ ప్రతినిధి లండ రామలింగం, ఎంపిటిసి మడ్డు పరమేశ్వరి, వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరి పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

జీడికి మద్దతు ధర ప్రకటించే వరకు పోరాటం

ప్రజాశక్తి- పలాస


జీడి పిక్కలకు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని జీడి రైతు సంఘం ఆధ్వర్యాన కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు వామపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయి. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంత కాలంగా జీడి గిట్టుబాటు ధరపై ఆందోళన చేసినా ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇస్తున్నారే తప్ప న్యాయం చేయడం లేదన్నారు. ప్రభుత్వం, స్థానిక మంత్రి రైతుల పక్షమా, వ్యాపారుల పక్షమా తెల్చాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధరను ప్రభుత్వం ప్రకటించక పోవడంతో ఇష్టానుసారంగా వ్యాపారులు దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సిఎంతో చర్చించినా జీడి ధరపై ఎటువంటి ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీడికి గిట్టుబాటు ధర కల్పించకపోతే జీడి రైతులు రానున్న ఎన్నికల్లో పాలకులకు, ప్రతిపక్ష పార్టీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సిపిఐ రాష్ట్ర నాయకులు చాపర సుందరలాల్, లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు, సిపిఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) నాయకులు పి.కుసుమ, చాపర వేణుగోపాల్, ఎఐకెఎం నాయకులు మద్దిల రామారావు, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్, ఎపి రైతు సంఘం నాయకులు కె.బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహనరావు

పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత

- పోలీసుల సమక్షంలో అంగన్వాడీ కార్యకర్త కుమారుడిపై దాడి చేసిన అధికార పార్టీ నాయకులు
- కేసు నమోదు



పోలీస్‌స్టేషన్ వద్ద వైసిపి, టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బంటు కొత్తూరులో సోమవారం అంగన్వాడీ కార్యకర్త, సర్పంచ్ పిట్ట షణ్ముఖరావు మధ్య జరిగిన కొట్లాట కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. వైసిపి, టిడిపి నాయకులు భారీగా చేరుకున్నారు. వైసిపి సర్పంచ్ షణ్ముఖరావు, అదే గ్రామానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త బెండి అప్పలనర్సమ్మల మధ్య కొంత కాలంగా వృత్తిపరంగా చిన్నచిన్న తగాదాలు ఉండేవి. అంగన్వాడీ కార్యకర్తపై సర్పంచ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి షోకాజ్ నోటీసులు ఇప్పించారు. సోమవారం మంత్రి సీదిరి అప్పలరాజు బంటుకొత్తూరులో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి వెళ్లిపోయారు. అదే సమయంలో అంగన్వాడీ కార్యకర్త, ఆమె కుటుంబ సభ్యులు, సర్పంచ్ షణ్ముఖరావు సచివాలయం కొట్టుకున్నారు. వెంటనే కార్యకర్త కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో వైసిపి, టిడిపి నాయకులతోనే, కార్యకర్తలతో పోలీస్ స్టేషన్ ఆవరణం నిండిపోయి ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. కార్యకర్త కుమారుడు కిరణ్ స్టేషన్ బయటకు రావడంతో స్టేషన్ ఆవరణలోనే వైసిపి నాయకులు క్రికెట్ బ్యాట్లు, కర్రలతో దాడి చేశారు. పోలీసులు వారిని వారించి బయటకు పంపించారు. రాత్రి 7 గంటల సమయంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పోలీస్‌స్టేషన్ చేరుకొని సిఐ విజయానంద్‌తో మాట్లాడారు. వైసిపి నాయకులపై కేసులు నమోదు చేయాలని, మరో మారు ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే మేమే కూడా అదే ధీటుగా దాడులకు సిద్ధపడతామని ఆమె హెచ్చరించారు. దీంతో కాశీబుగ్గ పోలీసులు వైసిపి సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు, టిడిపి కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.



నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ప్రసాదరావు

చేనేత వృత్తిదారులకు అండ

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్ మండలానికి చెందిన చేనేత వృత్తిదారులతో మంత్రి క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మంచి పాలన అందించాలన్న సదుద్దేశం ఉన్న పాలకపక్షాలు, అందరి అభ్యున్నతిని కోరే ప్రభుత్వాలు మన జీవితాలను తీర్చి దిద్దుతాయనేందుకు వైసిపి ప్రభుత్వం తార్కాణమని అన్నారు. యాంత్రీకరణ పెరగడంతో చేతి వృత్తులు మరుగున పడ్డాయని పేర్కొన్నారు. అందుకు చేనేత కుటుంబాలను ఆదుకునేందుకు నేతన్న నేస్తం పేరిట ఏటా రూ.24,500 ప్రభుత్వం అందజేస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అంబటి శ్రీనివాసరావు, కనపల అప్పలరావు, పాపారావు, బొకివాడ, వాసు, నీలాద్రి, గోవిందరావు, లక్ష్మణ్, నటరాజ పాల్గొన్నారు.

'ఆసరా' పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: ఎవరెన్ని విమర్శలు చేసినా ఆడవాళ్లకు బిడ్డ పాటు ఆర్థికంగా ఎన్నో సంక్షేమ పథకాలు అందించడం ద్వారా అండగా నిలిచామని, ఈ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి అండగా నిలవాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. నగరంలోని పిఎన్ఎం స్కూల్ ఆవరణలో ఆసరా లబ్ధిదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి కుటుంబానికి ఐదేళ్లలో ఆర్థికంగా పైకి తీసుకువచ్చేందుకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు మోసపూరిత మాటలు చెపుతున్నారని, వాటిని నమ్మవద్దన్నారు. ఈ భవిష్యత్ బాగుండాలంటే జగనే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అనంతరం నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారీయా, ధర్మాన రామ్మనోహర్ నాయుడు, కోణార్క్ శ్రీను, ఎం.వి.పద్మావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- జి.సిగడాం

రాష్ట్రంలో సన్న, చిన్నకారు రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలం శేతుభీమవరంలో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర అందేటట్లు చర్యలు తీసుకోవాలని, మొక్కజొన్న తదితర పంటలు అన్ని ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. దళారులు కుమ్మక్కై పంటల ధరలను తగ్గించి కౌలు రైతులను దగా చేస్తున్నారన్నారు. మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించి ధరలు విపరీతంగా పెంచి వినియోగదారుల నెత్తిన భారాలు వేస్తున్నారన్నారు. కౌలు రైతులకు సిసిఆర్ కార్డు లేదని, ఈ-క్రాప్ అవ్వలేదని కుంటి సాకులు చెప్పి రైతుల దగ్గర ఉన్న పంటలను కొనడానికి సవాలక్ష కారణాలు చూపిస్తున్నారన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ రైతాంగం నీటి సమస్య, భూముల సమస్య, మార్కెట్ సమస్యతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. తోటపల్లి కాలువ పూడికలు తీసి తోటపల్లి నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో కౌలు రైతుల సంఘం నాయుకులు వెలమల రమణ, సిఐటియు జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు, ఎస్.జగదీష్, శివుడు, టి.అప్పలనాయుడు, ఆదినారాయణ పాల్గొన్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

పార్టీలకతీతంగా సంక్షేమం

ప్రజాశక్తి- లావేరు

రాష్ట్రంలో టిడిపి, బిజెపి, జనసేన కుట్ర రాజకీయాలు చేస్తున్నాయని, మళ్లీ సిఎంగా జగన్మోహన్‌రెడ్డిని రెండోసారి గెలిపించాలని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలం సుభద్రపురం వద్ద చేయూత నాల్గవ విడత కార్యక్రమంలో భాగంగా 4,994 స్వయంశక్తి సంఘ సభ్యులకు రూ.9.36 కోట్లు నమూనా చెక్కును అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందించామన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెట్టించారని, ప్రతిపక్ష పార్టీలు అధికారంలోకి వస్తే ఈ పథకాలను రద్దు చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు, ఎంపిడిఒ కొండలరావు, ఎపిఎం మావూరి మాధవిలత, పిఎసిఎస్ అధ్యక్షుడు బురాడా చిన్నారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శిరీష

జీడి రైతులకు అండ

పలాస: రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి ప్రభుత్వం వచ్చిన వెంటనే జీడికి గిట్టుబాటు ధర కల్పించి రైతులకు అండగా ఉంటామని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష హామీ ఇచ్చారు. టిడిపి కార్యాలయంలో సోమవారం టిడిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జీడి రైతులకు ఒక వైపు న్యాయం చేస్తూ మరోవైపు వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. జీడి పంటకు అనుసంధానమైన కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. జీడి ఉత్పత్తి పెంచుతూ ఆదాయ మార్గాలు చూపించి యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించిన పలాస కిడ్నీ ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో పరికరాలు లేవని, కిడ్నీ పరిశోధన జరగడం లేదని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కిడ్నీ ఆస్పత్రి ద్వారా మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో నియోజకవర్గం నాయకులు యార్లగడ్డ వెంకన్న చౌదరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్ రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

'అగ్రిగోల్డ్' బాధితుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి గంగు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని బైక్ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని రామలక్ష్మణ కూడలి నుంచి సూర్యమహల్, ఏడు రోడ్ల కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముద్దాడ నరసింహప్పడు, కోరాడ శ్రీను, కింజరాపు రాజారావు, తంగి రాజారావు, ఐ.వి.రమణ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పనే ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం చీమలవలస కాలనీలో రూ.26.50 లక్షల నాబార్డ్ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామీణ పశు వైద్య కేంద్రాన్ని, నెల్లివలస్‌లో రూ.40.16 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీరు కొళాయిలను, కొరపాంలో రూ.25 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను సర్వమత గ్రంథాలుగా భావించి అమలు చేశారన్నారు. సిరిసింపేట గ్రామస్తులు తమ గ్రామంలో మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్ బాబు, పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కిషోర్, గుత్తేదారు బొడ్డేపల్లి శ్రీనాథ్, గురుగుబెల్లి నీలారావు పాల్గొన్నారు.



ఆమదాలవలస : కుళాయిలను ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

వలసల నివారణకే మూలపేట పోర్ట్

ఇచ్ఛాపురం: వలసలు నివారణ కోసమే సిఎం జగన్ మోహన్ రెడ్డి మూలపేట పోర్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. సోమవారం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. బెల్లుపడలో రూ. 80లక్షలతో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ఎక్కువ కాలం అధికారంలో ఉన్న టిడిపి నాయకులు ఈ జిల్లాలో వలసలు నివారణ కోసం ఏమి చేశారని ప్రశ్నించారు. టెండర్లు ఖరారు కాకుండా బాహుదా వంతెన నిర్మాణానికి శంకుస్థాపన ఎలా చేస్తారు అని విలేకరులు అడగ్గా సింగిల్ టెండర్ వచ్చినా ఖరారు చేసి నిర్మాణం చేపడతామనే నమ్మకం ఉందన్నారు. అనంతరం రూ.20కోట్లతో నిర్మించనున్న బాహుదా కొత్త వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కడ నుంచి పురుషోత్తం పురంలో కొత్తగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను, మండలంలో మండపల్లిలో రూ.90లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు పాల్గొన్నారు.



కవిటి : సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

సంతబొమ్మాళి: సంక్షేమం, అభివృద్ధి సిఎం జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్సీ.దువ్వాడ శ్రీనివాస్, వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. సోమవారం ఉమిలాడ పంచాయతీలో సర్పంచ్ కెల్లి లక్ష్మి ఆధ్వర్యంలో డోకి కామన్న పేటలో రూ.18 లక్షలతో అంగన్వాడీ భవనం, రూ.10 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా కాపు ఉమిలాడలో రూ.30 లక్షలు, ఉమిలాడలో రూ.60 లక్షలు, పెద్ద కోవిరి పేటలో రూ.30 లక్షలతో ఇంటింటికి తాగునీరు కుళాయిలను ప్రారంభించారు. ఉమిలాడలో 80 లక్షలతో సచివాలయ, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ప్రారంభించారు. పెద్ద కొవిరి పేటలో గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.40 లక్షలతో సిసి రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎంపిపి ఎం.రాజేశ్వరి, జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జీరు బాబురావు, నాయకులు బుడ్డా మోహన్ రెడ్డి, దుక్క భూషణ రెడ్డి, మార్పు నాగభూషణరావు, రామరాజు, నరేష్ పాల్గొన్నారు



ఇచ్ఛాపురం : అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు



సంతబొమ్మాళి :శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్, తిలక్

కవిటి: సచివాలయాలతో ప్రజలకు మెరుగైన సేవలు లభిస్తాయని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. కవిటి మండలం బెజ్జిపుట్టుగ, బిజీ పుట్టుగ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయాలను మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, ఎఎంసి వైస్ చైర్మన్ వై.నీలయ్య, ఎఎబి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్ సాహు, సర్పంచ్‌లు బెందాలం శ్రీరాం ప్రసాద్, ఎస్‌పి నారాయణస్వామి, బద్రి ప్రకాష్, దూగాన భద్రాచలం, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సజావుగా మండల సమావేశాలు

నౌపడ: సంతబొమ్మాలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మేరుగు రాజేశ్వరి ఆధ్వర్యంలో మండలం సర్వసభ్య సమావేశం సోమవారం సజావుగా సాగింది. ఆర్థిక సంవత్సరం చివరలో జరిగిన ఈ సమావేశంలో పలు సమస్యలను నాయకులు లేవనెత్తారు. వ్యవసాయ శాఖపై ఎఒ శ్రీలక్ష్మి పిఎం కిసాన్, పెండింగ్‌లో ఉన్న ధాన్యం సేకరణ సొమ్మును మరోవారం రోజుల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. నీటిపారుదల శాఖపై అధికారి మధు వేసవిలో నీటిఎద్దడి రాకుండా చేపడుతున్న ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్‌లో ద్వారా పైప్‌లైన్ ద్వారా ధ్వంసమైన రోడ్లు మరమ్మతులు చేయలేదని పలువురు సభ్యులు అధికారులను ప్రశ్నలు సంధించారు. వైద్య ఆరోగ్యశాఖపై జరిగిన చర్చలో డాక్టర్ సుధీర్ నాడు -నేడులో ఆస్పత్రిలో అభివృద్ధి, అందుబాటులో ఉన్న 147 రకాల వ్యాక్సిన్లు, అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రెవెన్యూ శాఖపై జరిగిన చర్చలో తహశీల్దార్, డిటి, ఆర్ఐ పైఅధికారుల మాటలు కూడా బేఖాతరు చేస్తున్నారని బిజీ పురం సర్పంచ్ మార్పు అశోక చక్రవర్తి నిలదీశారు. విద్యుత్ శాఖపై చర్చలో సీతానగరం వీధి మధ్యలో విద్యుత్ లైన్లు ఇబ్బందులు పరిష్కరించాలని ఎంపిటిసి సుధాకర్ ఎఇ శివకుమార్‌ను కోరారు. అలాగే బోరుభద్ర నుంచి విశాఖపట్నం వెళ్లే ఆర్‌టిసి బస్సు పునరుద్ధంచాలని పలువురు సభ్యులు ఆర్‌టిసి అధికారులను కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వసంత రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎఎంసి చైర్మన్ సుగ్గు పుణ్యావతి, ఎంపిడిఒ ఉమా సుందరి, వైస్ ఎంపిపిలు తులసమ్మ, నక్క చింతామణి పాల్గొన్నారు.



నౌపడ : జల జీవన్ మిషన్ వివరాలు వివరిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి మధు

హౌసింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

పొందూరు: జగనన్న కాలనీ పేరుతో అనర్హులకు ఇళ్ళపట్టాలు ఇచ్చారని, పట్టాలు పొందిన లబ్దిదారులు ఒకరైతే ఆ స్థలంలో నిర్మాణం చేపట్టిన వారు వేరొకరని ఈ అక్రమాలపై అధికారులు దృష్టి సారించరా అని పిల్లలవలస సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు అధికారులను ప్రశ్నించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కింతలి సర్పంచ్ రామప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వలన మ్యుటేషన్లు జరగడంలేదని. పిల్లల వలస, ధర్మపురం, దళ్లవలసలో భూసర్వే నిలిచిపోయిందని దీనిపై తహశీల్దార్‌ను అడిగితే ఎన్నికల విధుల్లో ఉన్నామని సమాధానం వస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.



ఓట్ ఫర్ ఒపిఎస్ పుస్తకాన్ని అవిష్కరిస్తున్న యుటిఎఫ్ సభ్యులు

సిపిఎస్‌ను మేనిఫెస్టోలో పెట్టాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సిపిఎస్ రద్దు అంశాన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని సిపిఎస్ జిల్లా కన్వీనర్ గొండు నారాయణరావు డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మండల కమిటి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల విద్యాశాఖా కార్యాలయం ఎదుట ఓట్ ఫర్ ఒపిఎస్ అనే పుస్తకాన్ని అవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సభ్యులు ఎర్నాగుల వాసుదేవరావు, నారాయణరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సింహాచలం, ఆనందరావు, సంజీవరావు, చంద్రమోహన్, సునీల్, కమలబాయ్, మన్మధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిఆర్ఎయు రిజిస్ట్రార్‌గా అడ్డయ్య

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

డా.బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో రిజిస్ట్రార్‌గా బి.అడ్డయ్య, అధ్యాపకులుగా పి.సుజాత నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాలను యూనివర్సిటీ ఛాన్సలర్ కె.ఆర్.రజిని సోమవారం తన ఛాంబర్‌లో అందించారు. వీరికి అధ్యాపకులు, భోదనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న అశోక్

ఏప్రిల్ 27 నుంచి విద్య, వైజ్ఞానిక తరగతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని టెక్కలి డివిజన్ కేంద్రంలోని ప్రణవి విద్యా సంస్థల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన వచ్చే నెల 27 నుంచి 30 వరకు రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తు న్నట్టు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ తెలిపారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ తరగతుల్లో ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ వ్యవహరించనున్నట్టు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక స్పృహ, సమాజంపై బాధ్యత ఉండేవిధంగా నాలుగు రోజుల పాటు తరగతులు ఉంటాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలు తీసుకొస్తున్నాయని అన్నారు. గాంధీజీ, భగత్‌సింగ్, అంబేద్కర్ వంటి మహనీయుల జీవిత చరిత్రలు పాఠ్యపుస్తకాల నుంచి తొలగించి చిలక జ్యోతిష్యం, గాంధీజీ చంపిన గాడ్సే, రామాయణం మూఢనమ్మకాలను ప్రేరేపిస్తూ పుస్తకాలు ముద్రిస్తు దేశాన్ని తిరోగం వైపు తీసుకెళ్తున్నారని అన్నారు. రాష్ట్రంలో జిఒ నంబరు 77 తీసుకొచ్చి ఉన్నత విద్యను ఉరితాడుగా మార్చిందన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహనరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.వెంకటేష్, బాలికల రాష్ట్ర కన్వీనర్ సిహెచ్.పావని, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రాజు, రమణ, జీవన్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, హరీష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు గుర్తింపు పత్రాలను అందజేస్తున్న డిఇఒ

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

రణస్థలం రూరల్: విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కోష్ట జంక్షన్‌లో ఉన్న నారాయణ స్కూల్‌లో సోమవారం సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవడం వలన మంచి వ్యక్తిత్వంతో పాటు ఆనందకర జీవితాన్ని అనుభవించగలరన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ అజ్జాడ త్రినాధరావు, స్కూల్ డైరెక్టర్ మంజు భార్గవి, కరస్పాండెంట్ గోవింద, ప్రిన్సిపాల్ గౌరు నాయుడు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి అందజేత

ఎచ్చెర్ల: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఎచ్చెర్ల, సంతబొమ్మాళి మండల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని 1500 మంది పదో తరగతి విద్యార్థులకు అట్టలు, పరీక్ష సామగ్రి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. పరీక్షలు పెద్ద సమస్య కానేకాదని, ఆత్మవిశ్వాసంతో ఇష్టంతో చదివి పరీక్షలకు సిద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతి విద్యార్థి దశకు ఎంతో కీలకమని, ఉపాధ్యాయులు అందించే సూచనలు, సలహాలు పాటించి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి అన్నారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



అట్టలను చూపిస్తున్న విద్యార్థులు

దళితులపై పెరిగిన దాడులు

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో గత ఎన్నికలకు ముందు సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తానని, అమలు చేసిన తర్వాతే ఓట్లు అడగడానికి వస్తానని చెప్పిన సిఎం జగన్మోహనరెడ్డి నాసిరకం మద్యాన్ని ఏరులై పారించారని, దీనివల్ల గడచిన ఐదేళ్లలో లక్షలాది మంది కిడ్నీ, లివర్ వంటి వ్యాధుల బారిన పడి ఆస్పత్రి పాలయ్యారని టిడిపి కూన రవికుమార్ ధ్వజమెత్తారు. నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులకు ఇచ్చిన సిపిఎస్ రద్దు హామీ, అంగన్వాడీలకు ఇచ్చిన జీతాల పెంపు హామీ, విద్యుత్ ఛార్జీలు పెంచనన్న హామీ ఏ ఒక్కటి నిలబెట్టు కోలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెపుతారన్నారు.

టిడిపిలోకి 40 కుటుంబాలు

ఆమదాలవలస: మండలంలోని వంజంగిలో 40 దళిత కుటుంబాలు మాజీ సర్పంచ్ యండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వంజంగికి చెందిన కళ్యాణ రాము, చింతాడ గణేష్, అలమండ తాతారావు, దవళ గణపతిరావుతో పాటు పలువురు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వీరికి టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై దాడులు పెరిగాయన్నారు. ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు ఎండ భీష్మ, యువకులు పాల్గొన్నారు.



ఆమదాలవలస : పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న రవికుమార్



కవిటి : బిజి పుట్టుగలో ప్రచారం చేస్తున్న నీలోత్పల

'సూపర్ సిక్స్'పై ప్రచారం

కవిటి: టిడిపితోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల అన్నారు. మండలం బిజి పుట్టుగ, బాలాజీ పుట్టుగతో పాటు పలు గ్రామాల్లో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు పథకాలపై వివరించారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని దుయ్యబట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మణి, బెందాళం విజయ్ కృష్ణ, కొర్రాయి వాసుదేవ్, బార్ల చినబాబు, కడియాల వెంకటరావు, లోళ్ల శ్రీను, తిరుమల పాల్గొన్నారు.

లావేరు : గుమ్మాడం పంచాయతీ వేణుగోపాలపురం, నాగంపాళెంలో సూపర్ సిక్స్ పథకాలుపై రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు ఇంటింటా వెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, ప్రధాన కార్యదర్శి పి.మధుబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి గొర్లె శ్రీనువాసరావు ఉన్నారు.

అంచెలంచెలుగా అభివృద్ధి

ప్రజాశక్తి- బూర్జ

రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ కుప్పిలి వరప్రసాద్ అన్నారు. ఆర్ఫ్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ కలెక్షన్స్ సెంటర్‌ను మండలం గోపిదేవిపేటలో ప్రారంభించారు ఈ కేంద్రం ద్వారా రైతులు పండించిన పంటలను నిల్వ ఉంచుకొని అధిక ధరలు వచ్చినప్పుడు మార్కెటింగ్ చేసుకోవడం, పైనాపిల్, పసుపు, చింతపండు వస్తు విలువ ఆధారిత అభివృద్ధి ద్వారా మరింత లాభాలు పొందాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారన్నారు. రైతు ఉత్పత్తిదారుల కంపెనీల ద్వారా మరింత ఫలితాలు పొందాలన్నారు. ఆర్ఫ్ డైరెక్టర్ సన్యాసిరావు మాట్లాడుతూ ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ నీలవేణి, డాక్టర్ అనూష, ఉద్యానవన శాఖాధికారి ఐయంతి, మండల వ్యవసాయ శాఖాధికారి వావిలిపల్లి రాజేశ్వరరావు, ఆర్ఫ్ సిఇఒ బి.శంకరరావు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడిఎ



కవిటి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

అశ్రద్ధ వహించి అవకాశం ఇవ్వద్దు

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం నియోజకవర్గం టిడిపి కంచుకోటని అశ్రద్ధ వహించి ప్రత్యర్థికి అవకాశం ఇవ్వొద్దని కార్యకర్తలకు, నాయకులకు ఎమ్మెల్యే అశోక్ దిశానిర్దేశం చేశారు. బస్టాండ్‌లోని లోళ్ల నారాయణమూర్తి కళ్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి టిడిపి సమన్వయ కమిటి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందరర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో ప్రజలతో మమేకం కావాలన్నారు. బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని కేడర్ కొంత నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న సూపర్ సిక్స్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని నియోజకవర్గ వ్యాప్తంగా పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో టిడిపి ఆత్మీయ కలయికలు నిర్వహిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని షలంత్రి, సింధు వాడ గ్రామ పంచాయతీల్లో ఆత్మీయ కలయిక సమావేశాలు నిర్వహించారు. ప్రతిరోజు రెండు, మూడు పంచాయతీల్లో నాయకుల బృందం పర్యటించి ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన విధి విధానాలపై పార్టీ శ్రేణులను అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబల్ల రాంబాబు, కిల్లి సిద్ధార్థ, లావేటి పూర్ణారావు, తాడేల వెంకటరమణ, అత్తులూరి హరిబాబు, వెంకటరావు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రోజా

గర్భిణులకు వైద్య పరీక్షలు

బూర్జ : 30 మంది గర్భిణులకు గుత్తావల్లి వైద్యాధికారులు రోజా, రమ్యశ్రీ సోమవారం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్థానిక పిహెచ్‌సిలో సూపర్‌వైజర్లతో, ఆశావర్కర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అవగాహనా లోపం కారణంగా మహిళలు తాము గర్భవతులమని లేటుగా తెలుసుకోవడం వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. గర్భిణులను గుర్తించి వారికి అవసరమైన మందులను అందజేయాలన్నారు. సమావేశం మురళి, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మెమొంటోను అందజేస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వరరావు

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

టెక్కలి: మారుతున్న సమాజంలో యువత చెడు మార్గాల వైపు పయనిస్తుందని ఈ క్రమంలో మత్తు పదార్థాలకు బానిస కావద్దని టెక్కలి ఎస్ఐ వెంకటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2వ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రావివలసలో నిర్వహిస్తున్న శిబిరాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సన్మార్గం వైపు నడవాలన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పిఒ లూక్ పాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

'యూలెర్న్'లో ఉద్యోగాలకు ఎంపిక

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న 89 మంది విద్యార్థులకు యూలెర్న్ సంస్థలో ఉద్యోగాలు దక్కాయి. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.5.2 లక్షల ప్యాకేజీపై ఈ నియామకాలు చేపడుతున్నట్టు కళాశాల డైరెక్టర్ బి.ఎస్ చక్రవర్తి ప్రిన్సిపాల్ శివశంకర్‌లు తెలిపారు. సోమవారం నియామకపు పత్రాలను కంపెనీ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, క్యాంపస్ కొలువులే కాకుండా అకాడమిక్ పైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టామని అన్నారు. యూనివర్సిటీ స్థాయి పరీక్షా ఫలితాల్లో మొదటి స్థానాలు సాధిస్తున్నామన్నారు. పిల్ల తల్లిదండ్రులు ఆశను, కళలను, కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలు నిజం చేస్తున్నాయన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ, డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్ నాయుడు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ చక్రవర్తి



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న తిలక్

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- నందిగాం

మండలం కవిటగ్రహారానికి చెందిన 15 టిడిపి కుటుంబాలు వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో సోమవారం వైసిపిలో చేరారు. కణితివూరులో జరిగిన కార్యక్రమంలో దట్టి జగ్గయ్య, బర్ల నరసింహమూర్తి, పుచ్చకాయల నరసింహమూర్తి, దాసరి మల్లేసు, వాకాడ మల్లేసు తదితరులు చేరారు. వీరికి కండువాలు వేసి తిలక్ పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ బొమ్మాళి గున్నయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు తమిరి ఫల్గుణరావు, జెసిఎస్ మండల కన్వీనర్ జడ్యాడ జయరాం, సర్పంచ్‌లు కణితి నారాయణమూర్తి, మల్ల సీతారాం, ఎంపిటిసి రామచంద్రుడు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న గ్రామ పెద్దలు

'హెల్పింగ్ హ్యాండ్స్' సేవలు భేష్

ప్రజాశక్తి- కవిటి

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో అన్నవరం హెల్పింగ్ హేండ్స్ సేవలు అభినందనీయమని పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజు సాహు కొనియాడారు. మండలం మాణిక్యపురంకు చెందిన నిరుపేద యువకుడు దిలీప్ దళాయి గతకొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆర్థిక సమస్యలతో వైద్యం కూడా చేయించుకోలేని స్థితిలో ఉన్నాడన్న విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న సభ్యులు ఆయనకు అండగా నిలిచారు. సోమవారం గ్రామ పెద్దలు దేవరాజు సాహు, మోహన్ సమక్షంలో రూ.5500 అందించారు. కార్యక్రమంలో బాబ్జీ రెడ్డి, సిద్ధు, లలిత, సునీత, సుజాత, దినేష్, గోపి, ప్రశాంత్, రాజేష్, నోర్సింగో, ప్రవీణ్, జైసన్, ధనుంజయ పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు

పలాస: మున్సిపాలిటీలో నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ 31 వార్డుల్లో పవర్ బోర్, పలు వార్డుల్లో సిసి రోడ్లు, కాలువలు ఏర్పాటుకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా వార్డులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. వార్డులకు మంచినీటి ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. కౌన్సిలర్ శార్వాణి గీత రవి, సతీష్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శ్రీనివాస్ పర్యటన

కోటబొమ్మాళి: వచ్చే ఎన్నికల్లో శ్రీకాకుళం పార్లమెంటు స్థానానికి ఎంపీగా పోటీ చేస్తున్న పేరాడ తిలక్‌కు, టెక్కలి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న దువ్వాడ శ్రీనివాస్‌లకు ఒక్క అవకాశం కల్పించి ఈ ఎన్నికల్లో గెలిపించాలని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలో దుప్పిలపాడు పంచాయతీలో సర్పంచ్ గురువెల్లి భారతి ప్రకాష్ అధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా, మండల విప్ బొడ్డు అప్పన్న, జెసిఎస్ కన్వీనర్ గద్దవలస నాగభూషణరావు ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకంగా ఉంటుందని రాష్ట్ర మెట్రో రైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ యు.జె.ఎం.రావు అభిప్రాయపడ్డారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగం ఆధ్వర్యాన ఈ నెల 11 నుంచి 16 వరకు 'సస్టైనబు అండ్ రెసిలియంట్ సివిల్ ఇంజినీరింగ్ ప్రాక్టీసెస్' అనే అంశంపై సోమవారం నిర్వహించబడుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శరవేగంగా మారుతున్న సాంకేతికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అధ్యాపకులు ఎప్పటికప్పుడు అవగాహన పొందాలన్నారు. నిర్మాణ రంగంలో వచ్చిన సాంకేతిక విప్లవం వల్ల భూగర్భంలో, అంతరిక్షంలో, సముద్రంలో నిర్మాణాలు చేయగలుగుతున్నామన్నారు. ఐతమ్ కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావులు మాట్లాడుతూ నిర్మాణ రంగంలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. రిసోర్స్‌పర్సన్లుగా ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.బాలప్రసాద్‌లు పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డి.విజయ్‌కుమార్, ఆర్ డీన్ డాక్టర్ డి.ఆజాద్, హెచ్చొడి డాక్టర్ పి.దినకర్, కన్వీనర్ డాక్టర్ సౌజన్యవాణి, కో- కన్వీనర్లు డాక్టర్ హెచ్.రామ్మోహన్, డాక్టర్ జి.డి.ఆర్.నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రావు

కళింగ కోమట్ల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం : కళింగ కోమట్ల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. పట్టణంలోని ఎంపీ ల్యాండ్ నిధులు రూ.5 లక్షలతో సామాజిక భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో బీసిలుగా గుర్తించారని అన్నారు. ఎంపీ రామ్మోహన్ నాయుడు ఓబిసిలో చేర్పించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన ఇంటింటి కుళాయి ద్వారా తాగునీరు సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. పనులు పూర్తి కాకుండానే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రారంభించారని విమర్శించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, కళింగకోమట్ల సంఘం ప్రతినిధులు డొకి నరేంద్ర, శసనపురి ప్రదీప్, సంతోష్, టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, నందిక జాని, సాలీనా ఢిల్లీ, దక్షత ఢిల్లీరావు, కాళ్ల దిలీప్‌కుమార్, పి.తవిటియ్య పాల్గొన్నారు.

పలాసలో సిపిఐ పోటీ

ప్రజాశక్తి- పలాస

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పలాస నుంచి సిపిఐ పార్టీ పోటీ చేయనుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర సుందరలాల్ తెలిపారు. సిపిఐ కార్యాలయంలో సోమవారం మండల పార్టీ కార్యదర్శులు, ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ పోటీ చేయడానికి నిర్ణయం తీసుకుందన్నారు. వంశధార శివారు ప్రాంతమైన వజ్రపుకొత్తూరు, పలాస మండలాలకు ఐదేళ్లుగా సాగునీరు అందలేదని, ప్రభుత్వానికి అనేక సార్లు చెప్పినా ఎందుకు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఖరీఫ్ నాటికైనా నిధులు కేటాయించి కాలువ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చాపర వేణుగోపాల్, మండల కార్యదర్శులు మద్దిల వెంకటరమణ, ఎస్.లచ్చయ్య, వి.భాస్కరరావు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు గోరు వాసుదేవరావు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎస్.హరికృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుందర్ లాల్

ఘనంగా చక్రతీర్థ స్నానాలు



సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురంలో సోమవారం వంశధార నదిలో చక్ర తీర్థ స్నానాలు ఘనంగా నిర్వహించారు. ఉమా రామలింగేశ్వర స్వామికి మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు పాడ్యమి సందర్భంగా వంశధార నదిలో చక్ర తీర్థ స్నానం నిర్వహించారు. పురోహితులు గంగవరపు వాసు శర్మ, చంటి శర్మ ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా నదికి తీసుకువెళ్లి చక్ర తీర్థ స్నానం నిర్వహించగా అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొని నదిలో స్నానాలు ఆచరించారు.

టెక్కలి రూరల్: మండలం రావివలసలో ఎండల మల్లిఖార్జున స్వామి దేవస్థానం మహాశివరాత్రి మహోత్సవంలో భాగంగా సోమవారం నరసన్నపేట హరిక ఆధ్వర్యంలో కోలాట నృత్య ప్రదర్శనతో తిరువీధి, చక్ర తీర్థ స్నానాలు నిర్వహించారు. కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణా ధ్రువపత్రాల పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో జాతీయస్థాయిలో జీవనోపాధులను అభివృద్ధి పరచే నేషనల్ రూరల్ లైవ్లీవుడ్ మిషన్ ద్వారా జిల్లా మహిళా సమాఖ్యలో ఒకరోజు శిక్షణ పొందిన ధ్రువపత్రాలను జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ చేతులమీదుగా మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు పొందారు. శిక్షణ పొందిన ప్రతినిధులు గ్రామస్థాయిలో మహిళలను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వనున్నారు. స్వయం శక్తి, రైతు ఉత్పత్తిదారుల సంఘాల మహిళలకు, వారి కుటుంబ ఆదాయాలను మెరుగుపరుచుకునే నిమిత్తం ప్రకృతి వ్యవసాయం, డైరీ పాల ఉత్పత్తులను పెంపొందించే పశువుల పోషణ, గొర్రెల పెంపకం, కోళ్ల పెంపకం, కూరగాయల పెంపకం, చిరుధాన్యాల ఉత్పత్తి కోసం గ్రామీణ మహిళలకు అవగాహన కల్పిస్తారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఉషారాణి, కోశాధికారి రేణుక, కార్యదర్శి బి.వేణమ్మ, ఉప కార్యదర్శి, రోజా, పాలకవర్గ సభ్యులు భారతి పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో మండల మహిళా సమాఖ్య లీడర్లు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చునని సిఐ టి.ఇమ్మాన్యుల్ రాజు అన్నారు. మండలం లొద్దపుట్టిలో సోమవారం రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు అధ్యక్షతన రోడ్డుభద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అతి వేగం ప్రమాదకరమని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దూర ప్రయాణాలు వెళ్ళినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఇంట్లో విలువైన వస్తువులు ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

'కిడ్నీ సూపర్ స్పెషాల్టీ' ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

కిడ్నీ రోగులు డాక్టర్ దంతం భీమారావు ఆస్పత్రిలో ప్రారంభించిన కిడ్నీ సూపర్ స్పెషాల్టీ సేవలను వినియోగించుకోవాలని డాక్టర్ యర్ర రాకేష్ అన్నారు. సోమవారం కాశీబుగ్గలో ఉన్న డాక్టర్ దంతం భీమారావు ఆస్పత్రిలో సావిత్రి కిడ్నీ సెంటర్, డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతంలో అధిక శాతం ఉన్న కిడ్నీరోగులకు చికిత్స గతంలో సుదూర ప్రాంతంలో అందుబాటులో ఉండేదని, ప్రస్తుతం పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో నాణ్యమైన చికిత్స కిడ్నీ రోగులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. కిడ్నీ సెంటర్ ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేటి నుంచి డోలోత్సవం

ప్రజాశక్తి- కవిటి

ఉద్దానప్రాంత ప్రజల ఆరాధ్య దైవం శ్రీదేవి భూదేవి సమేత చక్ర పెరుమాళ్ స్వామి డోలోత్సవ వేడుకలు మంగళవారం నుంచి వైభవోపేతంగా ప్రారంభం కానున్నాయని, మార్చి 12 నుంచి 25 వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 25వ తేదీ పౌర్ణమి రోజున నిర్వహించే స్వామివారి హెూలీ పౌర్ణమి జాతర, 26న వేకువ జామున జరిగే కామదహనం, డోలాహరణం కార్యక్రమాలతో వేడుకలు ఘనంగా ముగుస్తాయని తెలిపారు.

సిఎం సహాయనిధి అందజేత

శ్రీకాకుళం అర్బన్ : అనారోగ్య కారణాలతో సతమతమవుతున్న బలగ గ్రామానికి చెందిన కొమరపూరి జానకికి మంత్రి ధర్మాన రూ.45 వేలు సిఎం సహాయ నిధి చెక్కును సోమవారం అందించారు. ఆపద సమయంలో అన్ని తరగతులనూ ఆదుకునేందుకు వైసిపి ప్రభుత్వం ముందుంటుందని అన్నారు.

బావిలో పూడికతీత పనులు

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని 21,22 వార్డుల్లో సొంత నిధులతో బావిలో పూడికతీత పనులను కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్, కౌన్సిలర్ ప్రతినిధి కాళ్ల జయదేవ్ దగ్గర ఉండి పనులు చేపట్టారు. వార్డు ప్రజలు అభ్యర్థన మేరకు పుడుకుపోయిన బావిని మరమ్మతులు చేపట్టారు. వేసవి కాలంలో నీటి కోసం ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రామ్మోహనరావు పరామర్శ

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని ఐదవ వార్డు పంతులుపేటలో జన సైనికుడు గొర్డు కోటేష్ చిన్నాన్న లక్ష్మీనారాయణ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను సోమవారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు పరామర్శించారు. ఈయనతో పాటు జనసేన నాయకులు పైడి మురళీమోహన్, పైడి ధనంజయరావు, పొట్నూరు ప్రసాద్, గురుగుబెల్లి అశోక్, రామకృష్ణ పాల్గొన్నారు.



కోటేష్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రామ్మోహనరావు